అర్హులందరికీ సంక్షేమ పథకాల పంపిణీకి కృషి

రొంపిచర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని సుబ్బయ్యపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన కూటమి విజయోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అర్హులైన వారందరికీ అందేలా పార్టీ క్యాడర్ పనిచేయాలన్నారు. తమను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు శాసనసభ్యులు డాక్టర్ అరవిందబాబు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించటంలో తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే, ఎంపీలకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే మండలంలోని అన్నవరం, బుచ్చిపాపన్నపాలెం గ్రామాల్లో కూడా ఎమ్మెల్యే అరవిందబాబు పర్యటించారు. కార్యక్రమాల్లో తెలుగుదేశం, జనసేన నాయకులు కపలవాయి విజయకుమార్, సయ్యద్ జిలాని, వేల్పుల సింహాద్రియాదవ్, అట్లా చినవెంకటరెడ్డి, వట్టికుంట ఆంజనేయులు, పలువురు నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు

టీడీపీ కార్యకర్తకు ఎంపీ పరామర్శ

నరసరావుపేట: ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త అల్లూరి హరికృష్ణను ఆదివారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలాని పరామర్శించారు. ఈ నెల 4న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గృహంలో చోటుచేసుకున్న తెలుగు తమ్ముళ్ల కొట్లాటలో హరికృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన తనకు ఎమ్మెల్యే తాగునీరు కూడా ఇవ్వలేదని, హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నా పరామర్శించలేదని బాధితుడు మీడియా ముందు వాపోయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కూటమి ఎంపీ, జనసేన నాయకులు హాస్పిటల్‌లో కార్యకర్తను పరామర్శించారు. జరిగిన విషయం తెలుసుకొని తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ దాడి సంఘటనలో 43 మంది తమ్ముళ్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతోంది.



హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న హరికృష్ణను పరామర్శిస్తున్న లావు, జిలాని

వైద్యులకు అవగాహన సదస్సు

వినుకొండ (నూజెండ్ల): శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సంయుక్త ఆధ్వర్యంలో వినుకొండలోని వైద్యులకు కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ గుండె వ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ మాట్లాడుతూ.. గుండె పనితీరు, వైఫల్యం, చికిత్స వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శకుంతల గ్యాస్ట్రో కేర్ హాస్పిటల్ డాక్టర్ ఐలా శ్రీనివాసరావు ప్రసంగిస్తూ కామెర్ల వ్యాధి లక్షణాలు, దాని నివారణ మార్గాలు, వ్యాధికి గురయ్యే అవకాశాల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ వినుకొండ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్.ఎస్.రావు, డాక్టర్ జ్ఞానేశ్వరి, ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ సౌశీల్య, ట్రెజరర్ డాక్టర్ ఈదర కిషోర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ఆసుపత్రి, ఐఎంఏ వైద్యులు

కొత్తపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరం

రొంపిచర్ల: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని పాఠశాలలో ఆదివారం ఆర్ఆర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గుండె, ఊపిరితిత్తుల వైద్యనిపుణులు డాక్టర్ చింతగుంట శిరీషా అజయ్ 225 మందికి ఎకో, ఈసీజీ వంటి వైద్యపరీక్షలు చేశారు. వ్యాధి నిర్ధారణ అనంతరం అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ గుండె, ఊపిరితిత్తుల ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోజూ వ్యాయామానికి సమయం కేటాయించాలన్నారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు. తర్వాత ఆమె సేవలకుగాను గ్రామంలోని ఉపాధ్యాయులు, పెద్దలు ఘనంగా సత్కరించారు.



రోగికి ఎకో పరీక్ష చేస్తున్న డాక్టర్ శిరీషా అజయ్

పేదల వైద్యుడు కొల్లా రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట: వృత్తి పట్ల నిబద్ధత, నిజాయతీ గల వైద్యుడు కొల్లా రామారావు అని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పేర్కొన్నారు. పట్టణానికి చెందిన సీనియర్ వైద్యుడు కొల్లా రామారావు ఇటీవల మృతి చెందారు. ఆయన సంతాప సభను పట్టణంలోని నన్నపనేని కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ.. రామారావు మరణం ఎంతో బాధాకరమని చెప్పారు. పేదలకు అందుబాటులో ఉండే వైద్యుడిగా ఎంతో పేరు గడించారని పేర్కొన్నారు. ఆధునిక వైద్యంతో రోగులకు నిస్వార్థ సేవలు అందించారని కొనియాడారు. లయన్స్ క్లబ్ ద్వారా కూడా సేవలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో డాక్టర్ కొల్లా సతీష్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు ప్రారంభం

నకరికల్లు: త్యాగానికి ప్రతీకగా ముస్లిం సోదరులు జరుపుకొనే మొహర్రం పండుగ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మండలంలోని గుండ్లపల్లి, చల్లగుండ్ల గ్రామాల్లో చావిడీలను ముస్తాబు చేశారు. గ్రామాల్లో పీర్లపండుగగా పిలువబడే మొహర్రం వేడుకలు మొత్తం 11 రోజుల పాటు జరుపుకొంటారు. ఈ వేడుకల్లో భాగంగా తొలిరోజైన ఆదివారం పీర్ల పెట్టెలను చావిడీల్లో దించారు. వివిధ రకాల వస్త్రాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ముజావర్‌లు మాట్లాడుతూ 11 రోజుల పాటు నిర్వహించే మొహర్రం సందర్భంగా ప్రతి రోజు ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. 5, 7వ రోజు అలంకరించిన పీర్లతో చావిడీ వద్ద అగ్ని గుండంలో నడుస్తూ ప్రార్థనలు చేయనున్నట్లు తెలిపారు. 10వ రోజున పెద్ద షరగత్ సందర్భంగా విశేషంగా అలంకరించిన పీర్లతో అగ్నిగుండ ప్రవేశం, గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 11వ రోజు ఖత్తల్ సందర్భంగా మృతవీరులుగా భావించే పీర్లతో గ్రామోత్సవం నిర్వహించి చెరువు వద్ద జలంతో శుభ్రం చేయడంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చావిడీలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పీర్ల ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయినట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో చల్లగుండ్లలోని చావిడిలో అలంకరించిన పీర్లు (పాత చిత్రం)

అపరకర్మ భవన నిర్మాణ దాతలకు సత్కారం

సత్తెనపల్లి: విశ్వబ్రాహ్మణ శ్మశాన వాటికలో అపరకర్మ భవనం నిర్మించేందుకుగాను విరాళాలు అందించేందుకు సంఘ బాధ్యులు కొందరు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని విశ్వబ్రాహ్మణ (కల్యాణ మండపం) కార్యాలయంలో పట్టణ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోటగిరి పోతులూరయ్యాచారి ఆధ్వర్యంలో దాతలను ఆదివారం సత్కరించారు. పోతులూరయ్యాచారి మాట్లాడుతూ నరసరావుపేటకు చెందిన తిప్పర్తి వీరబోజయ్యాచారి రూ.25 వేలు, ఉద్యోగరీత్యా హైదరాబాదులో నివసిస్తున్న కోటగిరి శిధర్ తన తండ్రి లక్ష్మణాచారి జ్ఞాపకార్థం రూ.25 వేలు, సత్తెనపల్లికి చెందిన సంఘ సభ్యుడు తంగెళ్లపల్లి గురుభూషణాచారి తన తండ్రి బసవాచారి జ్ఞాపకార్థం అపరకర్మ భవనానికి ఇనుప గేటును బహూకరించారన్నారు. ఇంకా మరికొందరు సిద్ధంగా ఉన్నారని, మంచి వేదిక చూసి వారందరిని సత్కరించవలసిన బాధ్యత తమపై ఉందని అన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు వానపాముల రత్నాచారి, దాసు భాస్కరాచారి, కోటగిరి గోపి, అత్తలూరి కోటేశ్వరరావు, తంగెళ్లపల్లి గురుభూషణాచారి, నూతలకంటి చందు, తిప్పర్తి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



నేడు మహానేత వైఎస్సార్ జయంతి

నాదెండ్ల: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి తెలిపారు. గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహానేతకు ఘనంగా నివాళి అర్పించాలని కోరారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

నాదెండ్ల: నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్సై జె. బలరామ్‌రెడ్డి చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను వివరించి, పరిష్కరించుకోవాలని సూచించారు.

వినుకొండలో విజిలెన్స్ దాడులు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపుల్లో విజిలెన్స్, వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కిసాన్ ఆగ్రో టెక్నాలజీ అనే వ్యాపార సంస్థలో అమ్మకాలు, కొనుగోలుకు ఎటువంటి రికార్డులు నమోదు చేయకపోవడంతో అక్కడ ఉన్న సుమారు రూ.2.45లక్షల విలువైన 5,475 కిలోల జింక్, బోరాన్, ఇతర ముడి పదార్థాల అమ్మకాలను నిలిపివేశారు. ఎటువంటి అనుమతి లేకుండా నిల్వ చేసిన సుమారు రూ.7.30 లక్షల విలువైన 455 లీటర్ల పురుగు మందులను సీజ్ చేసి, కిసాన్ ఆగ్రో టెక్నాలజీ వ్యాపార సముదాయ లైసెన్స్‌ను సస్పెన్షన్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా విత్తనాల షాపుల్లో అనుమతులు లేకుండా అమ్మకాలు నిర్వహిస్తున్న సుమారు రూ.3.80 లక్షల విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఎస్ఐ రామచంద్రరావు, వ్యవసాయ శాఖ ఏఓలు వరలక్ష్మి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



రాజుపాలెం: త్రైత సిద్ధాంత భగవద్గీతతో ఆధ్యాత్మిక జ్ఞానం పొందవచ్చని త్రైత సిద్ధాంతం– ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక చిలకలూరిపేట కమిటీ అధ్యక్షుడు యద్దనపూడి వీరాంజనేయులు అన్నారు. ఆషాఢ మాసం గురు పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని ఇనిమెట్ల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా పెద్దగా ఉండటం వల్ల పౌర్ణమిని గురు పౌర్ణమిగా నిర్ణయించి సాక్షాత్తు శ్రీకృష్ణుడిని జగద్గురువుగా భావించి గురుపూజ చేయాలని అన్నారు. కార్యక్రమంలో హిందూ జ్ఞాన వేదిక సభ్యులు యద్దనపూడి వీరాంజనేయులు, చిర్రా వెంకటరామిరెడ్డి, గంగయ్య, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యమ్మ, పొట్లూరు పుల్లయ్య, స్వర్ణ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగండి

మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్

మాచర్ల: పట్టణ పురపాలక సంఘంలో వర్షాకాలం సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని కాచి చల్లార్చి వడగట్టి వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని వార్డులలో సమస్యలుంటే సచివాలయాలలో సిబ్బంది దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. అందులో భాగంగా నెహ్రూ నగర్‌లో వార్డు సెక్రటరీల వివరాలు పేర్కొన్నారు. ఆయా వార్డుల ప్రజలు సమస్యల పరిష్కారానికి శ్యామల స్టీఫెన్, ఘంటా తేజస్వి, సత్యాల స్టీఫెన్, అడపా ఆదిత్య సాయి, నందిగం సునిల్, పోలు రామిరెడ్డి, ప్రత్తిపాటి కుమారి, కుమ్మరపల్లి ఛాయాకృష్ణ, కె.షకీనా, గున్నా రమ్య, కేశిరెడ్డి లావణ్య, బొలకా రాము, మాతంగి దేవేందర్, పొన్నెల్లి ఈశ్వరరాజు, రమావత్ సంజీ నాయక్, గంజి ఆంజనేయులును సంప్రదించాలని కమిషనర్ వెంకట్‌దాస్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



మాచవరం: ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన ఘటన మండలంలోని కొత్త గణేశునిపాడు గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన జోగిపర్తి ఆంజనేయులు తన భార్య కాన్పు నిమిత్తం శనివారం నరసరావుపేట ఆసుపత్రికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటాన్ని ఇరుగుపొరుగు వారు గమనించి ఇంటి యజమానికి తెలియజేశారు. ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి, బీరువాలోని 50 సవర్ల బంగారం, రూ.2.50 లక్షలు నగదు, కిలో వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులకు తెలియజేయగా గురజాల సీఐ బాలకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించి, వివరాలను నమోదు చేశారు.

నేడు పట్టణంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు

హాజరు కానున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

నరసరావుపేట: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల సందర్భంగా పట్టణంలోని పలు వార్డులలో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించనున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. మాజీ శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వీటికి హాజరవుతారన్నారు. ఉదయం 9 గంటలకు ప్రకాష్‌నగర్‌లోని 60 అడుగుల రోడ్డు వైఎస్సార్ సీపీ కార్యాలయం, 9.15కు ప్రకాష్‌నగర్‌లోని 60 అడుగుల రోడ్డు, 9.30కి 12వ వార్డు షాలెంనగర్, 9.40కి ప్రకాష్‌నగర్ రిక్షా సెంటర్, 9.50కి రామిరెడ్డిపేట పాత సమితి ఆఫీసు వద్ద, 10కి 32వ వార్డు బరంపేట బైపాస్‌రోడ్డు వద్ద, 10.10కి 34వ వార్డు బీసీ కాలనీ, 10.20కి ఒకటో వార్డులోని సీబీఎస్ కాలనీ, 10.30కి ఐదో వార్డు క్రిస్టియన్‌పాలెంలోని విగ్రహాల వద్ద కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పార్టీ నాయకులు, వార్డు ఇన్‌చార్జులు, వివిధ శాఖల మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, ఎంపీపీలు, సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, కార్యకర్తలు, మహిళా అభిమానులు ఉదయం 8.30 గంటలకు ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డులోని పార్టీ కార్యాలయానికి వచ్చి కార్యక్రమంలో పాలుపంచుకోవాలని కోరారు.

రీడింగ్ ఆలస్యంతో నష్టపోతున్న వినియోగదారులు

చిలకలూరిపేట: విద్యుత్ రీడింగ్ ఆలస్యంగా తీయడం వల్ల వినియోగదారులు నష్టపోతున్నారని జాతీయ వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షుడు చదలవాడ హరిబాబు చెప్పారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది 30 రోజులకు రీడింగ్ తీయాల్సి ఉండగా, ఆ తర్వాత 40 రోజుల వరకు తీస్తున్నారని వివరించారు. 100 యూనిట్ల శ్లాబ్ వరకు యూనిట్‌కు రూ. 3.60 ఉందని చెప్పారు, దాటితే యూనిట్ ధర రూ. 6.90 అని వెల్లడించారు. రీడింగ్ ఆలస్యంగా తీయడం వల్ల బిల్లులు రెండో శ్లాబులోకి మారి దాదాపు రెట్టింపు బిల్లులు చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ అధికారుల ఆదేశానుసారం ఇలా ఆలస్యంగా రీడింగ్ తీసి వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. వినియోగదారులు ఈ విషయంలో కళ్లు తెరవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బి. నాగేశ్వరరావు, బి.సరోజిని, ఎం.కవిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చదలవాడ హరిబాబు

తొలి ఏకాదశిన అఖండజ్యోతి ప్రజ్వలన

వినుకొండ (నూజెండ్ల): శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినుకొండ మండలంలోని వితంరాజుపల్లిలో గల చిన్న షిరిడీలో 'మన ఊరు – మన కొండ' పేరిట ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిమాలయ గురూజీ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన తొలి ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొండపైన అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావులు, పల్నాడు కలెక్టర్ పి. అరుణ్‌బాబు, ఎస్పీ మలికా గార్గ్ హాజరవుతారన్నారు. అనంతరం పూజా కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెండేల మోహన్‌రావు, తాతా రమేష్, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, పెండేల సురేష్, పరుచూరి సత్యనారాయణ, స్వామి, పెండేల పుల్లారావు, వీరాస్వామి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హిమాలయ గురూజీ తదితరులు

క్లుప్తంగా

వైభవంగా శ్రీఅద్దంకమ్మ జాతర



రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ దేవత శ్రీఅద్దంకమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు పొంగళ్లు, నైవేద్యాలు పెట్టారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో అమ్మవారితోపాటు ఉపదేవతలకు కూడా గ్రామోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం జాతరలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి ప్రజల ఆందోళనకు స్వస్తి పలకాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అధికారం చేపట్టి నెల రోజులు కావస్తున్నా రైతు భరోసా, ప్రతి మహిళకు రూ.1,500, ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి కుటుంబానికి మూడు ఉచిత సిలిండర్లు తదితర హామీల అమలుపై ప్రభుత్వం సీరియస్‌గా లేకపోవడం ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఒకవైపు ఎన్నికల తర్వాత ప్రతిపక్షాలపై దాడులు జరగటం, పెన్షన్ తీసుకునేందుకు అనేక చోట్ల టీడీపీ నాయకులు తమ ఇళ్ల వద్దకు లబ్ధిదారులను రావాలనడం, ప్రతి ఇంటికి సరఫరా చేయాల్సిన రేషన్ బియ్యం డీలర్ చెప్పిన వద్దకు వెళ్లి తెచ్చుకోవాలనడం వంటి ప్రభుత్వ విధానాలు ప్రజలకు సేవ చేసేలా కన్పించటం లేదని వ్యాఖ్యానించారు. తొలకరి మొదలై రైతులు పంటలు వేసుకుంటున్నా పెట్టుబడి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నేటి వరకు విడుదల చేయలేదని గుర్తుచేశారు. కేంద్రం రూ.2 వేలు ఇచ్చి చేతులు దులుపుకోగా, మిగిలిన హామీలపై కూటమి ప్రభుత్వం నిధులు లేవని, ఇస్తామని కాలయాపన చేస్తోందన్నారు. అన్ని ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సీబీఎస్ఈ సిలబస్ అమలు శుభపరిణామం



శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఐదు జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉండగా, మొదట విడతలో శావల్యాపురం బడిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇది శుభ పరిణామం అన్నారు. వంద మంది విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతిలో ఉన్నారని తెలిపారు. సాంకేతిక విద్య (ఐటీ) బోధించటానికి ప్రత్యేకంగా ఉపాధ్యాయురాలిని నియమించినట్లు వివరించారు. వారానికి రెండు ప్రత్యేక తరగతులు కంప్యూటరు విద్య కోసం కేటాయించామన్నారు. తుది పరీక్షలకు విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఐనవోలు



నాదెండ్ల: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా సాతులూరు గ్రామానికి చెందిన ఐనవోలు సాంబశివరావు ఎన్నికయ్యారు. నరసరావుపేటలో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక జరిగింది.
నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. సాంబశివరావును గ్రామ ఆర్యవైశ్య సంఘం నాయకులు పలువురు అభినందించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నున్న నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.నాగేందర్‌రావు ఆదివారం తెలిపారు. గుండ్లపల్లిలోని సెల్‌ఫోన్ టవర్ వద్ద పేకాట నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,200 నగదును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.